ప్రసారం మరియు పంపిణీ చేయబడిన శుక్రవారం ఖుత్బా

తేదీ: 1 రబీ అల్–అవ్వల్ 1448 హిజ్రీ (14 ఆగస్టు 2026)

# వేసవి వేడి: వివేచన హితవు

అల్హమ్దు లిల్లాహిల్–హాదీ లిమనిస్తహ్దాహ్, అల్–ముజీబి లిమన్ దఆహ్, అన్–నాసిరి లిమనిస్తజార బిహీ వ నాదాహ్, లా హాదియ లిమన్ అధల్ల, వలా ముధిల్లా లిమన్ హదాహ్; {వమా బికుమ్ మిన్ నిఇమతిన్ ఫమినల్లాహి సుమ్మ ఇజా మస్సకముద్–ధుర్రు ఫఇలైహి తజ్–అరూన్}, వ అష్హదు అల్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీక లహ్, అల్–ముతఖద్దిసు ఫీ ఉలాహ్, వ అష్హదు అన్ న ముహమ్మదన్ అబ్దుల్లాహి వ రసూలుహూ వ ముస్తఫాహ్, వ ఖలీలుహూ వ ముజ్తబాహ్, సల్లల్లాహు అలైహి వ అలా ఆలిహీ వ సహ్బిహీ వ మన్ వాలాహ్, వ సల్లమ తస్లీమన్ కసీరన్ ఇలా యౌమి నల్ఖాహ్.

అల్లాహ్ దాసులారా!! అల్లాహ్‌కు భయపడండి:

وَلْتَنْظُرْ نَفْسٌ مَا قَدَّمَتْ لِغَدٍ وَاتَّقُوا اللَّهَ إِنَّ اللَّهَ خَبِيرٌ بِمَا تَعْمَلُونَ

మరియు ప్రతి ఆత్మ రేపటి (పరలోకం) కోసం తాను ఏమి పంపిందో పరిశీలించుకోవాలి. అల్లాహ్‌కు భయపడండి. నిశ్చయంగా, అల్లాహ్ మీరు చేసేదంతా బాగా ఎరిగినవాడు (అల్–హష్ర్: 18).

విశ్వాసులారా! అల్లాహ్ యొక్క జ్ఞానపూర్వక వివేకంలో ఒకటి ఏమిటంటే, ఈ లోకాన్ని పరీక్షలు, కష్టనష్టాలతో కూడిన నివాసంగా చేశాడు. దానిని బాధలు, శ్రమలతో కూడినదిగా మలిచాడు. తద్వారా విశ్వాసుల విధేయత, అల్లాహ్ విధి పట్ల వారి సమర్పణ స్పష్టమవుతుంది; అలాగే నిరాశచెందిన వారి అసంతృప్తి, ఆందోళన, అధైర్యం కూడా బహిర్గతమవుతాయి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَقَدْ خَلَقْنَا الْإِنْسَانَ فِي كَبَدٍ

నిశ్చయంగా, మేము మానవుడిని శ్రమ మరియు కష్టాలలో సృష్టించాము (అల్–బలద్: 4).

ఈ పరీక్ష రూపాలలో వాతావరణ మార్పులు కూడా ఒక భాగం–వేసవి మరియు శీతాకాలాల మధ్య మార్పులు; నిర్మలమైన ఆకాశం తరువాత ధూళి రావడం; పాదాలు మండిపోయేంత తీవ్రమైన వేడి, ఎముకలు కొరికేంత

చలి–ఇవన్నీ ఒక గొప్ప హితోపదేశం కోసమే. ఈ మార్పు మనల్ని వాటి పరమార్థం గురించి ఆలోచించేలా చేస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يُقَلِّبُ اللَّهُ اللَّيْلَ وَالنَّهَارَ إِنَّ فِي ذَلِكَ لَعِبْرَةً لِأُولِي الْأَبْصَارِ

"అల్లాహ్ రాత్రిని, పగలును మారుస్తూ ఉంటాడు. నిశ్చయంగా ఇందులో వివేకవంతులకు గుణపాఠం ఉంది." [అన్నూర్: 44]

అల్లాహ్ దాసులారా! ఈ రోజుల్లో మనం అనుభవిస్తున్న తీవ్రమైన వేడి ఒక గొప్ప సంకేతం, స్పష్టమైన సూచన. ఇందులో నిర్లక్ష్యంగా ఉన్న హృదయాలను మేల్కొలిపే సందేశం ఉంది; పరలోక గృహాన్ని గుర్తుచేసే బోధ ఉంది; ఈ ప్రపంచం విశ్రాంతి, బద్ధకం కోసం ఏర్పడిన స్థలం కాదని, పరీక్ష, కృషి, ఆచరణల స్థలమని తెలియజేసే హెచ్చరిక ఉంది. ప్రజలు రేపటి రోజు కోసం అవసరమైన పుణ్యసంపదను సమకూర్చుకోవడానికి, తమ ప్రభువును కలుసుకోవడానికి సిద్ధపడటానికే ఈ లోక జీవితం ప్రసాదించబడింది

فِي يَوْمٍ كَانَ مِقْدَارُهُ خَمْسِينَ أَلْفَ سَنَةٍ

యాభై వేల సంవత్సరాల నిడివి గల ఆ రోజున (అల్–మఆరిజ్: 4).

మండుతున్న సూర్యుని తాపం, ఎండవేళలో ధారలుగా కారే చెమట-ఇవి పరలోకంలో ప్రజల పరిస్థితిని మనకు కొంత దగ్గరగా అర్థమయ్యేలా చేసే అనుభవాలు. అప్పుడు వారి ప్రభువు వారందరినీ ఒకే మైదానంలో సమీకరిస్తాడు. వారి కష్టాలు తీవ్రంగా ఉంటాయి; పరిస్థితి వారికి అర్థంకాని స్థితికి చేరుతుంది; సూర్యుడు వారి తలకు సమీపంగా ఉంటాడు; భయం వారి హృదయాలను పూర్తిగా ఆవరించి ఉంటుంది. అప్పుడు ఆ పరిస్థితి అత్యంత భయానకంగా మారుతుంది, వేదన మరింత తీవ్రమవుతుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఇలా సెలవిచ్చారు:

»تُدْنَى الشَّمْسُ يَوْمَ الْقِيَامَةِ مِنَ الْخَلْقِ، حَتَّى تَكُونَ مِنْهُمْ كَمِقْدَارِ مِيلٍ، فَيَكُونُ النَّاسُ عَلَى قَدْرِ أَعْمَالِهِمْ فِي الْعَرَقِ، فَمِنْهُمْ مَنْ يَكُونُ إِلَى كَعْبَيْهِ، وَمِنْهُمْ مَنْ يَكُونُ إِلَى رُكْبَتَيْهِ، وَمِنْهُمْ مَنْ يَكُونُ إِلَى حَقْوَيْهِ، وَمِنْهُمْ مَنْ يُلْجِمُهُ الْعَرَقُ إِلْجَامًا«

ప్రళయ దినాన సూర్యుడు సృష్టికి చాలా దగ్గరగా తీసుకురాబడుతుంది, ఎంతలా అంటే వారి నుండి కేవలం ఒక మైలు దూరంలో ఉంటుంది. ప్రజలు తమ ఆచరణల ప్రాతిపదికన చెమటలో మునిగి పోతారు వారిలో కొందరికి చెమట కాలి మడమల వరకు ఉంటుంది; కొందరికి మోకాళ్ల వరకు ఉంటుంది; కొందరికి నడుము వరకు

ఉంటుంది; మరికొందరిని చెమట పూర్తిగా కప్పివేసి, నోటి వరకు చేరుతుంది." అని చెప్పేటప్పుడు అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన చేతితో నోటి వైపు  సైగ చేసి చూపించారు.

[ఇమామ్ ముస్లిమ్ సేకరించిన హదీస్ – మిఖ్దాద్ ఇబ్న్ అల్–అస్వద్ (రజి) కథనం].

విశ్వాసులారా! ఆ అత్యంత క్లిష్టమైన సమయంలో ప్రభువు తన ప్రత్యేక అనుగ్రహంతో ఒక సమూహాన్ని ఎన్నుకుంటాడు. తన అపారమైన ఔదార్యాన్ని వారిపై ప్రసాదించి, సూర్యుని వేడి నుండి వారిని తన అర్ష్ నీడలో రక్షిస్తాడు. ఆ రోజున ఆయన నీడ తప్ప మరే నీడా ఉండదు. వారి ఉన్నత స్థానం, గొప్ప  స్థితిని చూసి ప్రజలు వారిని చూసి అసూయపడతారు; వారి స్థితిని పొందాలని కోరుకుంటారు; వారి నీడలో కొంత భాగమైనా తమకు లభిస్తే ఎంత బాగుండునని ఆశపడతారు. కానీ ఎప్పటికీ తీరని  కోరిక! ఎందుకంటే ఆ నీడను దిర్హమ్, దీనార్‌లతో, ధనం, మంది మార్బలంతో  కొనలేము. రాత్రింబగళ్లు సత్కార్యాలు చేయడం, సర్వాధికారి అయిన అల్లాహ్ ఆగ్రహానికి కారణమయ్యే వాటికి దూరంగా ఉండడం ద్వారానే దాన్ని పొందగలం. అదే రక్షణకు కవచం; ఆ మహా విపత్తు నుండి విముక్తి పొందే మార్గం. అల్లాహ్ యొక్క ఆ విస్తృతమైన అనుగ్రహాన్ని మనం వేడుకుందాం.

ఆ రోజు మండుటెండల నుండి రక్షణ పొందే మార్గాలలో అబూ హురైరా (రజి) ద్వారా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) నివేదించిన ఈ హదీస్ ఒకటి:

« سَبْعَةٌ يُظِلُّهُمُ اللهُ فِي ظِلِّهِ يَوْمَ لَا ظِلَّ إِلَّا ظِلُّهُ: الْإِمَامُ الْعَادِلُ، وَشَابٌّ نَشَأَ بِعِبَادَةِ اللهِ، وَرَجُلٌ قَلْبُهُ مُعَلَّقٌ فِي الْمَسَاجِدِ، وَرَجُلَانِ تَحَابَّا فِي اللهِ، اجْتَمَعَا عَلَيْهِ وَتَفَرَّقَا عَلَيْهِ، وَرَجُلٌ دَعَتْهُ امْرَأَةٌ ذَاتُ مَنْصِبٍ وَجَمَالٍ، فَقَالَ: إِنِّي أَخَافُ اللهَ، وَرَجُلٌ تَصَدَّقَ بِصَدَقَةٍ فَأَخْفَاهَا، حَتَّى لَا تَعْلَمَ شِمَالُهُ مَا تُنْفِقُ يَمِينُهُ، وَرَجُلٌ ذَكَرَ اللهَ خَالِيًا، فَفَاضَتْ عَيْنَاهُ

"ఏడుగురిని అల్లాహ్ తన నీడలో ఆశ్రయిస్తాడు; ఆ రోజున ఆయన నీడ తప్ప మరే నీడా ఉండదు. వారు: న్యాయపరుడైన పాలకుడు; అల్లాహ్ ఆరాధనలో పెరిగిన యువకుడు; మసీదులతో మనో బంధం కలిగిన వ్యక్తి; అల్లాహ్ కోసం పరస్పరం ప్రేమించుకున్న ఇద్దరు వ్యక్తులు-అల్లాహ్ కోసం కలుసుకుని, అల్లాహ్ కోసమే విడిపోయిన వారు; హోదా మరియు ధనం, అందం  గల  ఒక స్త్రీ తనను పాపానికి ఆహ్వానించినప్పుడు 'నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను' అని చెప్పిన వ్యక్తి; తాను చేసిన దానధర్మాన్ని రహస్యంగా ఉంచిన వ్యక్తి-తన కుడిచేతి ఏమి ఖర్చు చేసిందో తన ఎడమచేతికి కూడా తెలియనంత రహస్యంగా దానం చేసినవాడు; ఏకాంతంలో అల్లాహ్‌ను స్మరించి, అతని కళ్ల నుండి కన్నీళ్లు ప్రవహించిన వ్యక్తి." [బుఖారీ మరియు ముస్లిం]

రుణామయుడైన అల్లాహ్ నీడను పొందడానికి గల కారణాలలో ఒకటి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తికి గడువు ఇవ్వడం, అతనిపై ఉన్న అప్పును గడువు వచ్చినప్పుడు కొంత తగ్గించడం లేదా పూర్తిగా మన్నించడం. ఇది సర్వాధికారి, ప్రతిఫల ప్రదాత అయిన అల్లాహ్ మన తప్పులను మన్నించడానికి ఒక కారణమవుతుంది. అబూ అల్–యసర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఇలా అనడం నేను విన్నాను:

« مَنْ أَنْظَرَ مُعْسِرًا أَوْ وَضَعَ عَنْهُ؛ أَظَلَّهُ اللهُ فِي ظِلِّهِ»

"ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తికి గడువు ఇస్తే లేదా అతని అప్పును మన్నిస్తే, అల్లాహ్ అతనిని తన నీడలో ఆశ్రయిస్తాడు." [ముస్లిం]

అల్లాహ్ దాసులారా! అటువంటి కారణాలలో మరొకటి అల్లాహ్ కోసం ప్రేమించుకోవడం, ఆయన ప్రసన్నత కోసం కలసి ఉండడం. ఇందులో భౌతిక ప్రయోజనాలకు, వ్యక్తిగత స్వార్థాలకు స్థానం ఉండదు. అక్కడ భౌతిక విషయాలకు గానీ, వ్యక్తిగత స్వార్థాలకు గానీ స్థానం ఉండదు. వారు ధర్మాన్నే తమ అనుబంధానికి ప్రామాణికంగా చేసుకుని, విశ్వాసాన్నే సోదరభావానికి బలమైన బంధంగా మార్చుకుంటారు. తద్వారా వారు నిజమైన, శాశ్వతమైన ప్రేమను పొంది, ఉన్నతమైన స్వర్గంలో దాని నీడను అనుభవిస్తారు. అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) తెలిపారు:

«إِنَّ اللهَ يَقُولُ يَوْمَ الْقِيَامَةِ: أَيْنَ الْمُتَحَابُّونَ بِجَلَالِي؟ الْيَوْمَ أُظِلُّهُمْ فِي ظِلِّي، يَوْمَ لَا ظِلَّ إِلَّا ظِلِّي

నా మహిమ కోసం పరస్పరం ప్రేమించుకున్నవారు ఎక్కడ ఉన్నారు? ఈ రోజు వారికి నా నీడను ప్రసాదిస్తాను; ఈ రోజు నా నీడ తప్ప మరే నీడా ఉండదు." [ముస్లిం]

ఆ కఠినమైన రోజున వేడి మరియు తీవ్రమైన చలి నుండి రక్షించే వాటిలో వివిధ రకాల దానధర్మాలు కూడా ఉన్నాయి. దానం చేసే వ్యక్తి తన మంచి కార్యానికి ప్రతిఫలంగా అల్లాహ్ యొక్క నీడతో గౌరవించబడతాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు

«إِنَّ الصَّدَقَةَ لَتُطْفِئُ عَنْ أَهْلِهَا حَرَّ الْقُبُورِ، وَإِنَّمَا يَسْتَظِلُّ الْمُؤْمِنُ يَوْمَ الْقِيَامَةِ فِي ظِلِّ صَدَقَتِهِ»

నిశ్చయంగా, దానం అనేది దానం చేసినవారి సమాధి వేడిని చల్లార్చుతుంది. ప్రళయ దినాన విశ్వాసి తాను చేసిన దానం యొక్క నీడలోనే ఉంటాడు (తబరానీ – ఉఖ్బా బిన్ ఆమిర్ రజి కథనం, అల్బానీ సరియైనదిగా ధృవీకరించారు).

నేను ఈ మాటలు చెబుతూ, నా కోసం, మీ కోసం మరియు సమస్త ముస్లిమ్‌ల కోసం ప్రతి పాపం నుండి గొప్పవాడు, మహోన్నతుడైన అల్లాహ్ క్షమాపణను వేడుకుంటున్నాను.

## రెండవ ఖుత్బా

అల్లాహ్‌కు మాత్రమే ప్రశంసలు తగును, ఆయన ఎంచుకున్న ఆయన దాసులపై శాంతి శుభాలు వర్షించుగాక! ఓ అల్లాహ్ దాసులారా! అల్లాహ్‌కు భయపడండి. మీ సమయాన్ని ఆరాధనలతో పవిత్రం చేసుకోండి, సత్కార్యాలతో మీ ఆయుష్షును సద్వినియోగం చేసుకోండి, నైతిక శుభకార్యాలతో మీ రోజులను నింపండి.

విశ్వాసులారా! నిజమైన, నికార్సయిన విశ్వాసి అంటే అల్లాహ్‌కు ప్రీతికరమైన కార్యాల వైపు, ఆయన ప్రసన్నతను పొందే పనుల వైపు త్వర పడేవాడు. వేసవిలో కొంత వేడి అతనికి తగిలినా, తన ప్రభువును రాజీ పరచుకోవడానికి నమాజుల వైపు వెంటనే ముందుకు సాగేవాడు; తన పుణ్యాన్ని, దైవభీతిని పెంపొందించుకోవడానికి విధేయతా కార్యాలలో చురుకుగా పాల్గొనేవాడు. అతనే  వివేకవంతుడు; ఉన్నతమైన స్థాయిలను పొందినవాడు. అతనే దూరదృష్టి కలవాడు; మహా సమూహం కూడే ప్రదేశంలోని తీవ్రమైన వేడి నుండి తనను తాను కాపాడుకున్నవాడు.

ఇక వాతావరణంలోని వేడి కారణంగా సోమరితనానికి లోనై, నమాజులకు హాజరుకాకుండా, తీవ్రమైన ఎండను సాకుగా చూపిస్తూ శుక్రవారం నమాజు మరియు సామూహిక నమాజులకు దూరంగా ఉండేవాడు——అతడు తనను తాను బలహీనపరచుకున్న దురదృష్టవంతుడు. అతని మనస్సు అతనికి ఈ విధంగా మోసం చేసింది; షైతాన్ అతన్ని మభ్యపెట్టాడు. అతడు విశ్వాసుల బృందం నుండి వెనుకబడిపోయి, కపటుల ప్రవర్తనను పోలి ఉంటాడు. వారు సర్వలోకాల ప్రభువైన అల్లాహ్‌కు విధేయత చూపడంలో వెనుకంజ వేసినప్పుడు వారి పరిస్థితి ఇదే. వారి మనోమయ స్థితి మరియు కర్మలను   వివరిస్తూ అల్లాహ్  ఇలా సెలవిచ్చాడు:

فَرِحَ الْمُخَلَّفُونَ بِمَقْعَدِهِمْ خِلَافَ رَسُولِ اللَّهِ وَكَرِهُوا أَنْ يُجَاهِدُوا بِأَمْوَالِهِمْ وَأَنْفُسِهِمْ فِي سَبِيلِ اللَّهِ وَقَالُوا لَا تَنْفِرُوا فِي الْحَرِّ قُلْ نَارُ جَهَنَّمَ أَشَدُّ حَرًّا لَوْ كَانُوا يَفْقَهُونَ

(యుద్ధానికి పోకుండా) వెనకుండిపోయినవారు దైవప్రవక్తకు సహకరించకుండా ఇంట్లో ఉండి పోయామనుకుంటూ సంబరపడ్డారు. దైవమార్గంలో ధనప్రాణాలొడ్డి పోరాడటం వారికి ఇష్టం లేదు. పైగా వారు ప్రజలతో "మండిపోతున్న ఈ వేడిలో బయలుదేరకండి" అన్నారు. "నరకాగ్ని వేడి ఇంతకంటే తీవ్రంగా ఉంటుంద"ని చెప్పు. వారీ విషయం గ్రహిస్తే ఎంత బాగుంటుంది! ఇప్పుడు వారు (తమ నిర్వాకం పట్ల)

నవ్వుకుంటే నవ్వుకోని. చివరకు వారు తమ దుష్కార్యాల ఫలితంగా పరలోకంలో హృదయ విదారకంగా రోదిస్తారు. (అత్-తౌబా: 81, 82).

అదేవిధంగా, హలాల్ జీవనోపాధిని సంపాదించడానికి శ్రమిస్తూ, కుటుంబాన్ని, పిల్లలను ఎవరి ఎదుటా చేయి చాచకుండా పోషించడానికి వేడిని సహిస్తూ పనిచేసే కార్మికులు, ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరికి గొప్ప ప్రతిఫలం మరియు ఉన్నత స్థానం వాగ్దానం చేయబడింది. కఅబ్ బిన్ ఉజ్రా రదియల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) అనుచరులు ఒక వ్యక్తి పక్క నుండి వెళ్తూ, అతని కష్టపడే తత్వాన్ని, పనిలో అతనికి ఉన్న ఉత్సాహాన్ని చూసి ఆశ్చర్యపడి: "ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇది గనక అల్లాహ్ మార్గంలో (జిహాద్‌లో) ఉంటే ఎంత బాగుండేది!" అని అన్నారు. దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఇలా తెలిపారు:

« إِنْ كَانَ خَرَجَ يَسْعَى عَلَى وَلَدِهِ صِغَارًا، فَهُوَ فِي سَبِيلِ اللهِ، وَإِنْ كَانَ خَرَجَ يَسْعَى عَلَى نَفْسِهِ يُعِفُّهَا، فَهُوَ فِي سَبِيلِ اللهِ »

"అతడు చిన్నపిల్లలైన తన సంతానాన్ని పోషించడానికి బయలుదేరి ఉంటే, అది అల్లాహ్ మార్గంలోనే. తనను తాను ఎవరి ఎదుటా చేయి చాచకుండా ఉండటానికి సంపాదించడానికి బయలుదేరి ఉంటే, అది కూడా అల్లాహ్ మార్గంలోనే." [తబరానీ ఉల్లేఖించారు; అల్బానీ దీనిని సహీహ్‌గా పేర్కొన్నారు.]

విశ్వాసులారా! వేసవి వేడి మనపై అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాన్ని గుర్తుచేసే కారణంగా మారాలి. ఆయన మనకు వేడిని నిరోధించే భవనాలను, విస్తారమైన శీతలీకరణ సదుపాయాలను అనుగ్రహించాడు. కాబట్టి వాటిని ప్రసాదించిన అల్లాహ్‌కు వెంటనే కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేయాలి. ఆ తరువాత వాటిని సంరక్షించడానికి, వాటి వినియోగాన్ని నియంత్రించడంలో సంబంధిత సంస్థలతో సహకరించడానికి కృషి చేయాలి. వాటిని ఉపయోగించడంలో వృథా, దుబారా చేయకూడదు.

అలాగే, తీవ్రమైన పరిస్థితుల్లో జీవిస్తూ, మనకు లభించిన ఈ నీడలు, చల్లదనపు సౌకర్యాలకు దూరంగా ఉన్న ప్రజల బాధలను మనం అనుభూతి చెందాలి. అది వారిని మంచితనంతో ఆదుకోవడానికి మనలను ప్రేరేపించాలి. బావులు తవ్వించడం, ఇళ్లు నిర్మించడం, నీడనిచ్చే గుడారాలు ఏర్పాటు చేయడం, ఎయిర్ కండిషనర్లు మరియు శీతలీకరణ పరికరాలు కొనివ్వడం వంటి మార్గాల ద్వారా వేడి, దాహం, కొరతల నుండి

వారికి ఉపశమనం కలిగించడానికి ముందుకు రావాలి. వేసవి వేడిని తట్టుకుని గడపడానికి అవసరమైన ఇతర సహాయ మార్గాల ద్వారా కూడా పేదలకు తోడ్పడాలి.

అబూ హురైరా (రజి) ద్వారా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) తెలిపిన హదీస్:

« بَيْنَمَا رَجُلٌ يَمْشِي، فَاشْتَدَّ عَلَيْهِ الْعَطَشُ، فَنَزَلَ بِئْرًا فَشَرِبَ مِنْهَا، ثُمَّ خَرَجَ، فَإِذَا هُوَ بِكَلْبٍ يَلْهَثُ، يَأْكُلُ الثَّرَى مِنَ الْعَطَشِ، فَقَالَ: لَقَدْ بَلَغَ هَذَا مِثْلُ الَّذِي بَلَغَ بِي، فَمَلأَ خُفَّهُ، ثُمَّ أَمْسَكَهُ بِفِيهِ، ثُمَّ رَقِيَ، فَسَقَى الْكَلْبَ، فَشَكَرَ اللهُ لَهُ، فَغَفَرَ لَهُ »

ఒక వ్యక్తి దారిలో నడుస్తుండగా అతనికి తీవ్రమైన దాహం వేసింది. అతడు ఒక బావిలోకి దిగి నీళ్లు తాగి బయటకు వచ్చాడు. అక్కడ ఒక కుక్క దాహంతో నాలుక బయటపెట్టి తడి నేలను నాకడం కనిపించింది. ఆ వ్యక్తి: "నాకు వేసినంత తీవ్రమైన దాహమే దీనికి కూడా వేసింది" అని అనుకుని, తన తోలు బూటులో నీళ్లు నింపి, దానిని నోటితో పట్టుకుని పైకి వచ్చి ఆ కుక్కకు నీళ్లు తాపాడు. అల్లాహ్ అతని ఈ ఆచరణను స్వీకరించి, అతని పాపాలను క్షమించాడు. సహాబా:"అల్లాహ్ ప్రవక్తా! జంతువుల పట్ల దయ చూపినందుకు కూడా మాకు పుణ్యం లభిస్తుందా?" అని అడిగారు. దానికి ప్రవక్త:

« فِي كُلِّ كَبِدٍ رَطْبَةٍ أَجْرٌ »

ప్రాణమున్న ప్రతి జీవికి  మేలు చేయడంలో పుణ్యం ఉంది అని సెలవిచ్చారు (బుఖారీ, ముస్లిమ్).

ఓ అల్లాహ్! అత్యంత ప్రకాశవంతమైన ముఖం, కాంతివంతమైన నుదురు కలిగిన నీ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై నీ దీవెనలు, శాంతి కురిపించు.

ఓ అల్లాహ్! విశ్వాసాన్ని మాకు ప్రియమైనదిగా చేసి, మా హృదయాలలో దానిని అందంగా అలంక రించు. అవిశ్వాసాన్ని, పాపకార్యాలను, అవిధేయతను మాకు అసహ్యమైనవిగా చేయు. మమ్మల్ని సన్మార్గాన్ని అనుసరించేవారిలో చేర్చు.

ఓ అల్లాహ్! ఇస్లాం మరియు ముస్లింలకు గౌరవాన్ని ప్రసాదించు, షిర్క్ (బహుదేవతారాధన) మరియు బహుదేవతారాధకులను హీనపరచు. నీ ధర్మానికి, నీ గ్రంథానికి (ఖురాన్), నీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) సున్నత్‌కు మరియు నీ విశ్వాసపాత్రులైన దాసులకు విజయాన్ని ప్రసాదించు. షిర్క్‌ను మరియు బహుదైవారాధకులను అవమానపరచు. నీ ధర్మానికి, నీ గ్రంథానికి, నీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతుకు, నీ విశ్వాసులైన దాసులకు సహాయం చేయు.

ఓ అల్లాహ్! ముస్లిం పురుషులను, ముస్లిం స్త్రీలను, విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను——వారిలో జీవించి ఉన్నవారినీ, మరణించినవారినీ——క్షమించు.

ఓ అల్లాహ్! దేశ భద్రతను కాపాడుతున్న మా సోదరులను సంరక్షించు. మా అమీరును మరియు ఆయన యువరాజును నీ సన్మార్గాన్ని అనుసరించేలా అనుగ్రహించు. వారి కార్యాలను నీ విధేయతలో, నీ ప్రసన్నతలో ఉండేలా చేయు.

ఓ అల్లాహ్! ఈ దేశాన్ని శాంతి, భద్రత, ప్రశాంతత, సౌభాగ్యం మరియు సమృద్ధితో కూడిన దేశంగా చేయు. దీనిని భద్రత మరియు విశ్వాసానికి నిలయంగా చేయు. అలాగే సమస్త ముస్లిం దేశాలకు కూడా శాంతి, భద్రత, స్థిరత్వం మరియు సౌభాగ్యాన్ని ప్రసాదించు.